నమస్తే తెలంగాణ

భద్రాద్రి కొత్తగూడెం

5 | ఖమ్మం, ఆదివారం 3 నవంబర్ 2024 | BHADRADRI KOTHAGUDEM




ఆసుపత్రిలో మందుల వద్ద రోగులు

సర్కార్ ఆసుపత్రి అంటేనే ఒకప్పుడు జనం భయపడిచచ్చేవారు. నేను సర్కార్ ఆసుపత్రికి రాను తండ్రో అంటూ మొత్తుకునేవారు. అటువంటి పరిస్థితి తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక పూర్తిగా మారిపోయింది. కేసీఆర్ ప్రభుత్వంలో తొమ్మిదేండ్లు ప్రభుత్వ దవాఖానల్లో పేదలకు అధునాతన వైద్య సేవలు అందాయి. పేదలకు పూర్తి నమ్మకం ఏర్పడడంతో వైద్యం కోసం ప్రభుత్వాసుపత్రులకు ధైర్యంగా క్యూ కట్టారు. కానీ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చింది.. సీన్ రివర్స్ అయ్యింది. మళ్లీ సర్కార్ ఆసుపత్రి పేరు చెబితేనే రోగులు భయపడిచస్తున్నారు. కనీస వైద్యానికి కూడా నోచుకోకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి జేబులు గుల్లజేసుకుంటున్నారు. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రోగులకు అందుతున్న అరకొర వైద్యాన్ని పరిశీలిస్తే ఈ విషయం తేటగా అర్థమవుతుంది.

# పేరుకే పెద్దాసుపత్రి

- కావాల్సిన మందులుండవు... సరిపడా డాక్టర్లుండరు
- మాతా, శిశు కేంద్రంలో కాన్పులూ అంతంతమాత్రమే..
- మూతపడిన ఆక్సిజన్ ప్లాంట్.. పనిచేయని వెంటిలేటర్లు
- సీరియస్ కేసులన్నీ ఖమ్మం, వరంగల్‌కే రిఫర్
- ప్రైవేట్‌కే మొగ్గు చూపుతున్న రోగులు
- జేబులు గుల్ల చేసుకుంటున్న నిరుపేదలు
- ఇదీ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రభుత్వాసుపత్రి దుస్థితి



కొత్తగూడెం ప్రభుత్వ ఆసుపత్రి

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కేంద్రమైన కొత్తగూడెం పట్టణంలో ఉన్న జిల్లా ప్రభుత్వాసుపత్రిలో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. పేరుకే పెద్దాసుపత్రి అయినా అక్కడ రోగులకు మందులు ఉండవు. కనీసం ఎక్స్‌రే తీసేవారు ఉండరు. మాతా, శిశు ఆరోగ్య కేంద్రంలో పరిస్థితి మరింత దుర్భరంగా తయారైంది. సరిపడా వైద్యులు లేకపోవడంతో గర్భిణులు బాగా ఇబ్బంది పడుతున్నారు. కాన్పుల కోసం వచ్చేవారికి ఖమ్మం ప్రభుత్వాసుపత్రికి లేదా ప్రైవేటుకు వెళ్లండంటూ ఉచిత సలహాలు ఇస్తున్నారు. మెడికల్ కాలేజీకి అనుసంధానంగా ఉన్నప్పటికీ సరిగా వైద్య సేవలు అందకపోవడంతో ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయించి జేబులు గుల్లజేసుకోవాల్సి వస్తున్నదని జిల్లావాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## పట్టిపీడిస్తున్న మందుల కొరత..

మలేరియా, డెంగీ జ్వరాలు విజృంభించడంతో రోగులు ప్రభుత్వాసుపత్రులకు క్యూ కడుతున్నారు. ఇటువంటి తరుణంలో మందుల కొరత పట్టిపీడిస్తున్నది. కనీసం షుగర్, బీపీ మందులు కూడా లేకపోవడంతో చుక్కలు చూస్తున్నారు. అజిత్రోమైసిన్, పాంటాప్రోజోల్, డైక్లో, ఇతర రోగాలకు అవసరమైన మందులు ఉండకపోవడంతో వైద్యులు బయటకు రాస్తున్నారు. ప్రతి చిట్టీలో బయట దొరికే మందులు రాయడం పరిపాటైంది. సర్కారు ఆసుపత్రికి సాధారణంగా పేద కుటుంబాలే ఎక్కువగా వస్తుంటాయి. పేదల కోసం గత కేసీఆర్ ప్రభుత్వం ఆసుపత్రుల్లో అన్ని సౌకర్యాలు కల్పిస్తే.. ప్రస్తుత కాంగ్రెస్ కనీసం మందులు కూడా ఇవ్వలేని పరిస్థితిలో ఉంది. జిల్లాలో 29 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, అర్బన్ హెల్త్ సెంటర్లు 5, పీపీ యూనిట్లు 5తోపాటు 5 ఏరియా ఆసుపత్రులు, జిల్లాకేంద్రంలో మెడికల్ కాలేజీ అనుబంధంగా జనరల్ ఆసుపత్రి ఉంది. ఏ ఆసుపత్రికి వెళ్లినా మందుల కొరత స్పష్టంగా కనబడుతున్నది.



ఆసుపత్రి ఆవరణలో మురుగు నీరు

## కాన్పులు అంతంతమాత్రమే..

మాతా, శిశు కేంద్రం విషయానికొస్తే వంద పడకల ఆసుపత్రిలో ఇద్దరే గైనిక్‌లు ఉన్నారు. కాన్పులు చేయలేక గర్భిణులను వేరే ఆసుపత్రులకు రిఫర్ చేయాల్సి వస్తున్నది. దీంతో పేద ఆడబిడ్డలు 'ప్రైవేటు'ను ఆశ్రయించక తప్పడం లేదు. గతంలో తల్లీబిడ్డ చనిపోయిన ఘటనతోపాటు గర్భిణి బాత్రూంలో డెలివరీ అయిన ఘటనలూ రోగులకు గుర్తుకు రావడంతో మాతా, శిశు కేంద్రానికి రావడం కూడా తగ్గింది. గతంలో ఇచ్చిన 'కేసీఆర్ కిట్లు' ఇవ్వకపోగా, న్యూట్రిషన్ కిట్లు కూడా ఇవ్వడం లేదు. దీంతో ఎక్కువ మంది ప్రైవేట్ ఆసుపత్రులను ఆశ్రయిస్తున్నారు.

## మూతపడిన ఆక్సిజన్ ప్లాంట్..

వెంటిలేటర్లు లేకపోవడంతో సీరియస్ కేసులు వస్తే బయట ఆసుపత్రులకు పంపిస్తున్నారు. మొత్తం 10 వెంటిలేటర్లలో రెండు మాత్రమే పని చేస్తున్నాయి. దీంతో సీరియస్ కేసులు వస్తే ఖమ్మం, వరంగల్‌కు రిఫర్ చేస్తున్నారు. గతంలో ఆక్సిజన్ ప్లాంట్ అందుబాటులో ఉండేది. ఇప్పుడు అది కాంగ్రెస్ ప్రభుత్వ పుణ్యమా అని మూతపడింది.

## గత ప్రభుత్వంలో సకల సౌకర్యాలు



కేసీఆర్ ప్రభుత్వంలో అన్ని ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య సేవలు అందాయి. 'కేసీఆర్ కిట్లు' ఇవ్వడంతో మాతా, శిశు విభాగంలో కాన్పులు ఎక్కువ జరిగాయి. ఇప్పుడు ఏ కిట్లూ ఇవ్వడం లేదు. ఆసుపత్రికి వెళ్తే పట్టించుకునే వారేలేరు. డయాలసిస్ కేంద్రం తెచ్చింది గత కేసీఆర్ ప్రభుత్వంలోనే. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఆక్సిజన్ లేదు. ఎక్స్‌రేలు పని చేయడం లేదు. మురుగు కాలువ నీరు బయటకు వచ్చి ఆసుపత్రి అంతా దుర్గంధం వెదజల్లుతున్నది.

– వనమా వెంకటేశ్వరరావు, మాజీ మంత్రి, కొత్తగూడెం

## మందుల కొరత లేదు..

ప్రభుత్వాసుపత్రిలో మందుల కొరత లేదు. రోగులే మందులు బయటకు రాయండి అని అడుగుతుంటారు.. తప్ప మేము బయటకు రాయడం లేదు. వెంటిలేటర్ సమస్య ఉన్న మాట వాస్తవమే. రిపేర్ల కోసం పై అధికారులకు తెలియజేశాం. త్వరలో సమస్య పరిష్కారం అవుతుంది. గైనిక్‌లు లేకపోవడం వల్ల కొంత ఇబ్బంది ఉంది. కాన్పులు బాగానే చేస్తున్నాం.

– డాక్టర్ రాధామోహన్, ఆసుపత్రి సూపరింటెండెంట్



## ప్రసవానికి వస్తే చేయలేమన్నారు..

పది రోజుల క్రితం పురిటి నొప్పులతో రామవరంలోని మాతా, శిశు కేంద్రానికి వచ్చాను. ప్రసవ సమయానికి మేం చెయ్యలేం.. మా దగ్గర వైద్యులు లేరని చెప్పారు. పెద్ద ప్రాణానికి ఇబ్బంది ఉన్నదని చెప్పారు. వెంటనే ఖమ్మం లేదా వరంగల్ తీసుకెళ్లాలని సూచించారు. గత్యంతరం లేక కొత్తగూడెంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి కుటుంబ సభ్యులు తీసుకొచ్చారు. ప్రసవం కోసం రూ.21 వేలు ఖర్చయ్యాయి. బిడ్డ, నేను క్షేమంగానే ఉన్నాం. మాతా, శిశు కేంద్రంలో వైద్యులు లేనప్పుడు ఆసుపత్రిని ఎందుకు నడిపిస్తున్నారు. మా లాంటి మధ్య తరగతి కుటుంబాల పరిస్థితి ఏమిటి.

– బి.నందిని, బాలింత, మాయాబజార్, రుద్రంపూర్



## మందుల కొరత వాస్తవమే..

అన్ని మందులు లేవని కాదు. కొన్ని మందులు రాలేదు. వస్తాయి. ఇండెంట్ పెట్టాం. స్టోర్ ఖమ్మంలో ఉంది. ఎవరికొచ్చినా అక్కడ నుంచే రావాలి. రాగానే అన్ని ఆసుపత్రులకు సరఫరా చేస్తాం. యాంటిబయాటిక్స్ రెండు రకాలు ఉన్నాయి. మలేరియా మాత్రలు అందుబాటులో ఉన్నాయి. డెంగీ కేసులు తగ్గాయి. మలేరియా రాకుండా దోమల మందు పిచికారీ చేస్తున్నాం.

– డాక్టర్ భాస్కర్‌నాయక్, డీఎంహెచ్‌వో, భద్రాద్రి కొత్తగూడెం

# కొనుగోలు కేంద్రాలు ప్రారంభించండి

- తాలు పేరుతో కోతలు విధించొద్దు
- వీసీలో మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి



వీసీలో మాట్లాడుతున్న కలెక్టర్ జితేశ్ వి పాటిల్

భద్రాద్రి కొత్తగూడెం, నవంబర్ 2 (నమస్తే తెలంగాణ) : నిర్దేశించిన ప్రణాళిక ప్రకారం జిల్లాల్లో ధాన్యం కొనుగోలు కేంద్రాలను వెంటనే ప్రారంభించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశించారు. హైదరాబాద్‌లోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్ సచివాలయం నుంచి ధాన్యం కొనుగోళ్లపై రాష్ట్ర ఉన్నతాధికారులతో కలిసి అన్ని జిల్లాల కలెక్టర్లతో మంత్రి శనివారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. వీసీలో ఐడీవోసీ నుంచి కలెక్టర్ జితేశ్ వి పాటిల్, సీపీవో సంజీవరావు, పౌర సరఫరాల అధికారి త్రినాథ్‌బాబు, డీఎం నరేందర్, డీసీవో సయ్యద్ ఖుర్షీద్‌లు పాల్గొన్నారు. ధాన్యం కొనుగోళ్లపై చేపట్టాల్సిన చర్యల గురించి ఆ శాఖ ప్రధాన కార్యదర్శి డీఎస్ చౌహాన్ దిశానిర్దేశం చేశారు. అనంతరం మంత్రి ఉత్తమ్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోళ్లు పకడ్బందీగా జరిగేలా కలెక్టర్లు ప్రత్యేకంగా పర్యవేక్షించాలన్నారు. సన్నరకం ధాన్యం సాగును ప్రోత్సహించేందుకు ప్రభుత్వం క్వింటాకు రూ.500 చొప్పున బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. కొనుగోలు కేంద్రాల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించి కొనుగోలు చేయాలని, తాలు పేరుతో కోత విధిస్తే సహించేది లేదన్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధాన్యం అమ్మిన రైతుల బ్యాంకు ఖాతాల్లో రెండు రోజుల్లో డబ్బులు జమ అయ్యేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. పట్టాదారు పాస్ పుస్తకం, ఆధార్ కార్డు, బ్యాంకు అకౌంట్ జిరాక్సు కాపీ కొనుగోలు కేంద్రాల్లోనే అందజేస్తే రెండు రోజుల్లో డబ్బులు అకౌంట్‌లో జమ అవుతాయని పేర్కొన్నారు.

# సర్వే నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు

- ప్రాథమిక టీచర్లను ఎన్యూమరేటర్లుగా నియమించాలి
- ధాన్యం కొనుగోలు కేంద్రాలను పూర్తిస్థాయిలో తెరవాలి
- వీడియో సమావేశం ద్వారా సమీక్షించిన అదనపు కలెక్టర్ శ్రీజ



వీసీలో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ శ్రీజ

ఖమ్మం/మామిళ్లగూడెం, నవంబర్ 2 : జిల్లాలో ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని అదనపు కలెక్టర్ డాక్టర్ పి.శ్రీజ ఆదేశించారు. శనివారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లాలోని తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంఈవోలు, సంబంధిత అధికారులతో ఇంటింటి సర్వే సన్నద్ధతపై, ధాన్యం, పత్తి కొనుగోళ్లపై వీసీ ద్వారా ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సర్వే కోసం ప్రాథమిక పాఠశాల టీచర్లను ఎన్యూమరేటర్లుగా వినియోగించాలని, ప్రాథమిక పాఠశాలలు ఉదయం పూట మాత్రమే పని చేయాలని, మధ్యాహ్నం నుంచి టీచర్లు ఎన్యూమరేషన్‌లో పాల్గొనేలా చూడాలన్నారు. అలాగే జిల్లాలోని సరిహద్దు మండలాల పరిధిలో చెక్ పోస్టుల వద్ద అధికారులకు డ్యూటీలు వేయాలన్నారు. 5 మండలాల పరిధిలోని 9 పత్తి కొనుగోలు కేంద్రాలను తహసీల్దార్లు సందర్శించి నివేదిక అందించాలని ఆదేశించారు. జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలు పూర్తిస్థాయిలో తెరవాలన్నారు. ఇందుకోసం జిల్లా మార్కెటింగ్ అధికారితో సమన్వయం చేసుకోవాలని సూచించారు. ధాన్యం కొనుగోళ్లు, ఎన్యూమరేషన్‌లో ప్రజలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే 1077 టోల్ ఫ్రీ నెంబర్‌కు ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలని, దీనిపై విస్తృతంగా ప్రచారం కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు. వీసీలో ట్రైనీ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, సీపీవో ఏ.శ్రీనివాస్, డీఈవో సోమశేఖర శర్మ, డీఆర్వో రాజేశ్వరి, ఆర్డీవోలు, డీపీవో రాంబాబు, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

# 5న బీసీ కమిషన్ ప్రజాభిప్రాయ సేకరణ

మామిళ్లగూడెం, నవంబర్ 2 : తెలంగాణ బీసీ కమిషన్ ప్రతినిధుల బృందం నవంబర్ 5వ తేదీ మంగళవారం ఖమ్మం జిల్లాకు రానున్నది. రాష్ట్రంలో స్థానిక సంస్థల వారీగా కల్పించాల్సిన, అవసరమైన రిజర్వేషన్ల దమాషాను పేర్కొనే విషయంలో ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మైనార్టీ మత గురువులు, మేధావులు, విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, ఎన్‌జీవో ప్రతినిధుల అభిప్రాయాలను తెలుసుకోనున్నది. ఈ మేరకు ఖమ్మం కలెక్టరేట్‌లో నిర్వహించే సమావేశంలో తమ అభిప్రాయాలను రాత పూర్వకంగా నేరుగా సమర్పించాలని జిల్లా మైనార్టీ సంక్షేమాధికారి కే.సత్యనారాయణ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తేదీ ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు కమిషన్ చైర్మన్ నిరంజన్ ఆధ్వర్యంలో సభ్యులు రాపోలు జయప్రకాష్, తిరుమలగిరి సురేందర్, బాలలక్ష్మి, బీసీ వెల్ఫేర్ కమిషనర్లతో కూడిన బృందం ప్రజాభిప్రాయ సేకరణ చేయనున్నట్లు పేర్కొన్నారు. అభిప్రాయాలను నిర్దేశిత నమూనాలో తెలుగు, ఇంగ్లిషు భాషల్లో ఇవ్వాలని తెలిపారు. సమర్పణలు, అభ్యర్థనలు, సలహాలు, ఆక్షేపణలు కమిషన్‌కు నివేదించవచ్చని సూచించారు.

# రూ.20 లక్షలు ఇవ్వకుంటే పనులు జరగనివ్వం..

- సీతారామ ప్రాజెక్టు భూనిర్వాసిత రైతుల హెచ్చరిక
- జూలూరుపాడు మండలంలో లింక్ కెనాల్ పనుల అడ్డగింత



జూలూరుపాడు మండలంలో సీతారామ ప్రాజెక్టు లింక్ కెనాల్ పనులను అడ్డుకున్న భూనిర్వాసిత రైతులు

జూలూరుపాడు, నవంబర్ 2 : సీతారామ ప్రాజెక్టు కాలువ నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.20 లక్షలు నష్టపరిహారం ఇవ్వకుంటే, కాలువ పనులను ఎట్టిపరిస్థితుల్లోనూ జరగనివ్వమని భూనిర్వాసిత రైతులు హెచ్చరించారు. జూలూరుపాడు మండల పరిధిలోని వినోభానగర్ గ్రామ సమీపం నుంచి సీతారామ ప్రాజెక్ట్ ప్రధాన కాల్వకు అనుసంధానంగా నిర్మిస్తున్న లింక్ కెనాల్ కాల్వ పనులను శనివారం అడ్డుకున్నారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా పర్యటనలో భాగంగా లింక్ కెనాల్ నిర్మాణంలో భూములు కోల్పోతున్న రైతులకు ఎకరానికి రూ.20 లక్షలు అందజేస్తామని పేర్కొన్నారని, ప్రస్తుతం అధికారులు గ్రామసభ పెట్టి ఎకరానికి కేవలం రూ.13.50 లక్షలు ఇస్తామంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మంత్రి తుమ్మల ఇచ్చిన హామీ మేరకు ఎకరానికి రూ.20 లక్షలు ఇవ్వాలని, లేకుంటే పనులను జరగనివ్వమని తేల్చిచెప్పారు. పట్టా భూములకు ఒక రేటు, ఎస్టీ, ఎస్సీ, బీసీ కులాల వారీగా వేర్వేరుగా నష్టపరిహారం అందిస్తామని అధికారులు చెప్పడం సరికాదన్నారు. అందరికీ సమానంగా నష్టపరిహారం అందజేయాలని డిమాండ్ చేశారు. కాలువ పనులు జరుగుతున్న ప్రదేశంలోని జేసీబీలు, యంత్రాలను పక్కన పెట్టించి డ్రైవర్లను ఇంటికి పంపారు. రైతులకు తెలియకుండా పనులను చేపడితే రైతుసంఘాలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడతామని పేర్కొన్నారు. పనులను అడ్డుకున్న వారిలో భూ నిర్వాసిత రైతులు గుగులోతు శ్రీనివాసరావు, గుగులోత్ రమేష్, చప్పుడు ప్రసాద్, ఎల్లంకి వెంకటేశ్వర్లు, ముదిగొండ రమేష్, సిరికొండ నర్సింహారావు, సిరికొండ నాగయ్య, బండారి మల్లయ్య, పుష్పరాజ్యం వాణి తదితరులు ఉన్నారు.

# ఆటలపై ఆసక్తి పెంచుకోవాలి

- కేయూ రిజిస్ట్రార్ మల్లారెడ్డి
- అట్టహాసంగా ప్రారంభమైన కేయూ ఇంటర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలు



పరుగు పందెంలో పోటీ పడుతున్న పురుషులు



పరుగు పందెంలో పోటీ పడుతున్న మహిళలు

ఖమ్మం సిటీ, నవంబర్ 2 : విద్యార్థులు, యువత ఆటలపై ఆసక్తి పెంచుకుంటే పోటీతత్వం పెరగడంతోపాటు వారిలో క్రమశిక్షణ అలవడుతుందని కేయూ రిజిస్ట్రార్ పీ మల్లారెడ్డి అన్నారు. ఖమ్మం నగరంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో కాకతీయ యూనివర్సిటీ పరిధి ఇంటర్ జిల్లా అథ్లెటిక్స్ పోటీలను శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా రిజిస్ట్రార్ మాట్లాడుతూ క్రీడలతో దేశ ప్రతిష్ట సైతం పెరుగుతుందనే వాస్తవాన్ని ప్రతీ క్రీడాకారుడు గమనించాలని సూచించారు. కేయూ పరిధిలో నిర్వహిస్తున్న క్రీడల విజయవంతానికి పలు రకాల కమిటీలు వేసి మంచి ఫలితాలు సాధిస్తున్నామన్నారు. కేయూ స్పోర్ట్స్ బోర్డు కార్యదర్శి వెంకయ్య మాట్లాడుతూ ఇప్పటివరకు మూడు దశల్లో జరిగిన పోటీల్లో దాదాపు వెయ్యి మందికి పైగా క్రీడాకారులు తమ ప్రతిభను చాటి వెలుగులోకి వచ్చారని వెల్లడించారు. జిల్లా యువజన, క్రీడల అధికారి టీ సునీల్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న క్రీడా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమానికి యూపీసీఈ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సీహెచ్ రవికుమార్ అధ్యక్షత వహించగా.. కేయూ పీడీల సంఘం కార్యదర్శి డాక్టర్ బీ వెంకన్న, పీ శ్రీనివాస్, కోటి, అథ్లెటిక్స్ కోచ్ ఎండీ గౌస్, కార్యదర్శి ఎండీ షఫీ, పీడీలు శ్రీనివాస్‌రెడ్డి, రఘునందన్, ఏటీబీటీ ప్రసాద్, జే ఉపేందర్, సావిత్రి, లక్ష్మీకాంత్, సుధాకర్ పాల్గొన్నారు.

**వివిధ అంశాల్లో క్రీడా విజేతల వివరాలు ఇలా..**

**పురుషుల 100 మీటర్ల పరుగుపందెంలో..** : ఏ గౌతమ్(కేఎండీసీ, ఖమ్మం), బీ అంజి(కేడీసీ హనుమకొండ), ఎస్‌కే లాల్‌పాషా(కేడీసీ, ఖమ్మం).

**మహిళల 100 మీటర్ల పరుగుపందెంలో..** : ఏ మైథిలి(ఎస్ఆర్అండ్‌బీజీఎన్ఆర్, ఖమ్మం), ఎస్‌కే అఫ్రీన్(కేఎండీసీ, ఖమ్మం), అమ్నా అంజుమ్(ప్రభుత్వ డిగ్రీ కళాశాల, మంచిర్యాల), 4) ఎం.మనీషా (టీఎస్‌డబ్ల్యూఆర్‌డీసీ, ఖమ్మం), 5) వీ శృతి(టీటీఎస్‌ఆర్‌డీసీ కొత్తగూడెం).

# రుణమాఫీ చేయకపోతే రోడ్డెక్కుతాం..

- రైతులతో కలిసి ఆందోళనలు చేపడుతాం..
- ముగ్గురు మంత్రులున్నా పెండింగ్ ప్రాజెక్టులు పూర్తి కావట్లే..
- సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు



సీపీఎం మండల మహాసభలో మాట్లాడుతున్న పోతినేని సుదర్శన్‌రావు

బోనకల్లు, నవంబర్ 2 : కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన మాట ప్రకారం రుణమాఫీ చేయకపోతే రైతులతో కలిసి రోడ్డెక్కి ఆందోళనలు చేపడుతామని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు హెచ్చరించారు. మోటమర్రి గ్రామంలో శనివారం నిర్వహించిన 9వ సీపీఎం మండల మహాసభలో ఆయన పాల్గొని మాట్లాడారు. జిల్లాలోని పెండింగ్ ప్రాజెక్టులను ముగ్గురు మంత్రులున్నా పూర్తి చేయకపోవడం బాధాకరమన్నారు. రైతులకు వ్యవసాయ రుణాలు ఇచ్చే సమయంలో రేషన్ కార్డు ఆధారంగా ఇచ్చారా? మాఫీకి, దీనికి లింకు పెట్టడం ఏమిటని ఆయన ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్ ప్రభుత్వ అసమర్థతకు నిదర్శనమన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చిన ఆరు గ్యారెంటీలను ఎందుకు అమలు చేయడం లేదన్నారు. రాష్ట్ర ఖజానా ఖాళీ అనే విషయం ఎన్నికల సమయంలో కాంగ్రెస్ నాయకులకు తెలియదా? కౌలు రైతులకు ఇచ్చిన హామీ ఏమైంది? రైతు భరోసా, రైతుబంధుపై ఎన్నిసార్లు మాట తప్పుతారని ఆయన మండిపడ్డారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రాష్ట్ర కమిటీ సభ్యుడు పొన్నం వెంకటేశ్వరరావు, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బండి రమేశ్, బొంతు రాంబాబు, చింతలచెరువు కోటేశ్వరరావు, బంధం శ్రీనివాసరావు, దొండపాటి నాగేశ్వరరావు, మాజీ ఎంపీపీ చిట్టిమోదు నాగేశ్వరరావు, మాజీ సర్పంచ్ కేతినేని ఇందు, సొసైటీ అధ్యక్షుడు బోజడ్ల పుల్లారావు తదితరులు పాల్గొన్నారు.

# భద్రాద్రిలో కార్తీక సందడి

- తొలిరోజు శివాలయాలకు పోటెత్తిన భక్తజనం
- పవిత్ర గోదావరి నదిలో భక్తుల పుణ్యస్నానాలు



పవిత్ర స్నానాలు ఆచరిస్తున్న భక్తులు



గోదావరిలో కార్తీక దీపాలు వదులుతున్న దంపతులు

భద్రాచలం, నవంబర్ 2 : కార్తీక మాసం సందర్భంగా భద్రాద్రి రామాలయం శనివారం భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామునుంచే వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు గోదావరి నదీ తీరంలో భక్తిశ్రద్ధలతో స్నానాలు ఆచరించారు. సమీప ఉప ఆలయమైన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయం, అంబాసత్రంలోని శివాలయంతోపాటు పట్టణ పరిధిలో గల పలు ఆలయాల్లో మహిళలు పూజలు చేశారు. ఆలయ ఆవరణలో కార్తీక దీపాలు వెలిగించి స్వామివారి అభిషేకాలు చేశారు. నూతన దంపతులు సైతం నదిలో పుణ్యస్నానాలు ఆచరించి కార్తీక దీపాలు వదిలారు. దీంతో రామాలయ పరిసరాల్లో ఎటుచూసినా భక్తుల సందడే కనిపించింది.

**శివాలయంలో...**

దేవస్థాన అనుబంధ ఆలయమైన అన్నపూర్ణ సమేత కాశీవిశ్వేశ్వరస్వామి ఆలయంలో ఉదయం నుంచి అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శివ భక్తులు కార్తీక మాసం సందర్భంగా దీక్షలు చేపట్టగా వారికి అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చిత్రకూట మండపంలో సత్యనారాయణస్వామి వ్రతాలు చేశారు.

# పెద్దమ్మగుడిలో రుద్రాభిషేకం

పాల్వంచ రూరల్, నవంబర్ 2 : మండలంలోని పెద్దమ్మ తల్లి ఆలయంలో కార్తీకమాసం సందర్భంగా శనివారం రుద్రాభిషేకం జరిపారు. ఆలయ ప్రాంగణంలోని శివలింగానికి దేవస్థాన వేద పండితులు మహాన్యాస పూర్వక రుద్రాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి హారతి, మంత్రపుష్పం పూజలు చేపట్టారు. కార్యక్రమంలో ఈవో రజనీకుమారి, అర్చకులు, భక్తులు పాల్గొన్నారు.



రుద్రాభిషేకం జరుపుతున్న అర్చకులు